క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

దామెర : మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో కొనసాగుతున్న పరకాల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సులో సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. 2023–24లో పదోతరగతిలో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8801154611, 8309932519 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

నియామకం



దామెర : మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని పులుకుర్తి గ్రామానికి చెందిన పెంచాల రఘును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ ఆదివారం నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కన్వీనర్ మహేందర్, యూత్ అధ్యక్షుడు బండి సంజీవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరుకాపు సంఘం బలోపేతం కోసం తనవంతుగా కృషిచేస్తానని తెలిపారు.

జయప్రదం చేయాలి

ధర్మసాగర్ : జులై 7న నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో 15 మందితో ఎమ్మార్పీఎస్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఎస్సీల అభివృద్ధి, న్యాయం కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చివరి దశలో ఉన్నందున బీజేపీ ప్రభుత్వం, దేశ ప్రధాని మోదీ ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి మండల కేంద్రంలో నిర్వహించాలని కోరారు. శివ, దేవరాజ్, రాజు, అంటోని, అరుణ్ కుమార్, శ్రీనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లపై చర్య తీసుకోవాలి

పరకాల: పట్టణంలో అక్రమంగా వెలిసిన వెంచర్‌లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, 4వ వార్డు కౌన్సిలర్ దేవునూరి రమ్యకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పురాతన ఇళ్ల రిజిస్ట్రేషన్‌లకు రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఇంటి అనుమతులు కావాలని కోరుతున్న స్థానిక రిజిస్ట్రర్.. అక్రమ వెంచర్‌ల ఏర్పాటుపై ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా వెలిసిన అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

తీన్మార్ మల్లన్నను కలిసిన నాయకులు



కమలాపూర్ : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గుండపు చరణ్‌పటేల్, మాట్ల రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండపాక మనీష్, దూడ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : గర్మిళ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ పద్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గర్మిళ్లపల్లి, ఉడుతగూడెంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పాత్రికేయుల నివాళి



ఎల్కతుర్తి : రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల మండలంలోని పాత్రికేయులు విచారణ వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద పాత్రికేయులు, పలు సంఘాల నాయకులు రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమేష్, స్వామి, రామకృష్ణ, హరికుమార్, వెంకటేష్, చరణ్, భిక్షపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో సమస్యల స్వాగతం..

- 12న పాఠశాలల పునఃప్రారంభం
- పేరుకుపోయిన సమస్యలు
- ప్రహరీ లేక ఇబ్బందులు
- తీరని డ్రెయినేజీ, నీటి సమస్య



ప్రహరీ లేకుండా ఉన్న కస్తూర్బా పాఠశాల

వేలేరు : ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ పాఠశాలలో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 260 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండల కేంద్రానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఈ పాఠశాలను నిర్మించారు. దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా ప్రహరీ నిర్మించలేదు. దీంతో విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల ప్రాంగణంలో ఖాళీ ప్రదేశం ఎక్కువగా ఉండటంతో కోతులు, పాములు, పశువులు, పందులు నిత్యం సంచరిస్తున్నాయని విద్యార్థినులు భయాందోళన చెందుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో హరితహారంలో నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోతుందని, క్రీడలు ఆడేందుకు కూడా ఇబ్బందికరంగా ఉందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాలలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పాఠశాల పక్కనే మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుందని, చుట్టూ పక్కల ఇళ్లవారు పాఠశాలలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పాఠశాలలో తాగునీరుకు ఇబ్బంది ఉందని, మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదని విద్యార్థినులు అంటున్నారు. అలాగే మండల కేంద్రం నుంచి కస్తూర్బా పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు, టీచర్లు, కోరుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి వచ్చే ఆర్టీసీ బస్సులు ఉదయం, సాయంత్రం గొల్లకిష్టంపల్లి వరకు కొనసాగించేలా చూడాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



గొల్లకిష్టంపల్లి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి. ప్రహరీ లేక కోతులు, పాములు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. పాఠశాలలో డ్రెయినేజీ వ్యవస్థ కూడా అధ్వాన్నంగా ఉంది. ఆర్టీసీ అధికారులు బస్సును పాఠశాల వరకు రోజుకు రెండు ట్రిప్పులు నడిపించాలి.

– బంక శ్రీనివాస్, విద్యార్థి సంఘం నాయకుడు, వేలేరు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఖబడ్దార్



ఎల్కతుర్తి : కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమలాపూర్ : మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్కతుర్తి : బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. మంత్రి పొన్నంను విమర్శించే అర్హత, స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదన్నారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు దక్కలేదని, పార్టీ పూర్తిగా గల్లంతైందన్నారు. కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే గ్రామాల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. నాయకులు రాజు, రవీందర్, ప్రకాశ్, రమేశ్, స్వరూప, శ్రీకాంత్, రాజు, చంద్రశేఖర్ గుప్తా, లింగమూర్తి పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టకోవాలని, లేనిపక్షంలో తెలంగాణ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. బూడిద రవాణాపై అర్థంపర్థం లేకుండా అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. 38 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఒకే పార్టీలో కొనసాగుతూ అంచెలంచెలుగా ఎదిగి నేడు రాష్ట్ర మంత్రిగా నిబద్ధతతో పని చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అసత్య ఆరోపణలు చేసే నైతిక హక్కు కౌశిక్‌రెడ్డికి, బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్‌మెయిల్ చేసి అనైతికంగా గెలిచిన కౌశిక్‌రెడ్డి మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో తన పార్టీ నియోజకవర్గంలో మూడో స్థానానికి పడిపోయిందని, దాంతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంత్రి పొన్నంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, రమేశ్‌గౌడ్, ఐలయ్యగౌడ్, భిక్షపతి, ప్రభాకర్, శివకృష్ణగౌడ్, పర్శ రాములుగౌడ్, సురేష్, రాములు, శ్రీధర్, రమేశ్, శ్రీకాంత్, శ్రీనివాస్, చంద్రమౌళి, ప్రశాంత్, శివానందం, రామకృష్ణ, వెంకటేష్, రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఐనవోలు : హాజరైన ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థులు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బాల్య మిత్రులు అప్యాయంగా పలకరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటా పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు బాబురావు, సంపత్, సుధాకర్, రవీందర్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పాఠశాలలో 1989–90లో పదోతరగతి చదివిన విద్యార్థులు 34 సంవత్సరాల తర్వాత మండల కేంద్రం సమీపంలోని ఏఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులందరూ ఒకే వేదికపై



దామెర : ఆత్మీయ సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

కలుసుకొని ఆప్యాయంగా పకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. తమ బోధనలను అనుసరించి జీవితంలో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులను చూసి ఆనందపడ్డారు. ఉపాధ్యాయులు గంటా రామిరెడ్డి, చిలువేరు జనార్దన్, కన్నెబోయిన సారయ్య, ఈశ్వరయ్య, సతీష్, ఈశ్వర్‌రావు, వెంకటరెడ్డి, సాంబయ్య, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు హింగె రాజేశ్వర్‌రావు, దామెరుప్పుల అశోక్, అశోక్, శంకర్, ప్రవీణ్, రవీందర్, నిరంజన్, కరుణాకర్, భాస్కర్, తిరుపతి, రాజేశ్వరి, పూర్వ విద్యార్థులు పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



శాయంపేట : సంబురాలు చేసుకుంటున్న నాయకులు



ఎల్కతుర్తి : సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు



దామెర : సంబురాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

శాయంపేట : భారతదేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆ పార్టీ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. అలాగే ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు చిరంజీవి, పైడిపల్లి పృథ్వీరాజ్, జనగాని కిష్టయ్య, కంచర్ల శంకరయ్య, ముష్కె వెంకటేష్, పెరుక మధుసూదన్, దేవేందర్, ఆడెపు శ్రీవర్ధన్, పల్లెపాటి మధుకర్, రమణాచారి, లచ్చిరెడ్డి, రాజు, సురేష్, మల్లయ్య, నాంపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. బస్టాండ్ కూడలిలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాచం గురుప్రసాద్, నాయకులు దేవునూరి మేఘనాథ్, మేకల రాజవీర్, దగ్గు విజేందర్‌రావు, గాజుల నిరంజన్, కుక్కల విజయ్, మారేడుగొండ భాస్కరాచారి, బాసాని సోమరాజు, పిట్ట వీరస్వామి, జంగేటి సారంగపాణి, నాగెల్లి రంజిత్, గోనెల రంజిత్ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మూడోసారి దేశప్రధానిగా నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండల వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకొన్నారు. మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు మేరుగు శ్రీను, సండేసారి సంతోష్, బిల్లా రమణారెడ్డి, ఎక్కలదేవి రమేశ్, కన్నె కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



పరకాల : బీజేపీ శ్రేణుల సంబురాలు

కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

శాయంపేట : మండలంలోని శాయంపేట, మైలారం, పత్తిపాక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో కార్మిక శాఖ, సీఎస్సీ హెల్త్ కేర్ వెల్నెస్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆదివారం అసంఘటిత కార్మికులకు ఉచిత ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. కార్మికుల నుంచి రక్త, మూత్ర నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఎస్సీ హెల్త్‌కేర్ జిల్లా కో ఆర్డినేటర్ హరీష్ మాట్లాడుతూ.. ఈ ఆరోగ్య శిబిరం ద్వారా కార్మికులందరికీ బీపీ, షుగర్, కంటి, వినికిడి, గుండె, ఊపిరితిత్తులకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సేకరించిన రక్త, మూత్ర నమూనాలను పరీక్షించి కార్మికులకు సంబంధించిన హెల్త్ ప్రొఫైల్‌ను అందించనున్నట్లు తెలిపారు. వారి ఆరోగ్య స్థితినిబట్టి తగిన సలహాలు సూచనలు అందించడం జరుగుతుందన్నారు. క్యాంపు కో ఆర్డినేటర్లు నాగరాజు, ప్రవీణ్, కార్మికులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను తెరిపించండి

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ ఆరు నెలలుగా మూసివేయడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్‌ను రిపేర్ చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జీపీ అధికారులను పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎలక్షన్ కోడ్ ఉందని దాటవేత ధోరణి అవలంభించిన అధికారులూ.. ఇప్పటికైనా వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేపించి ప్రజలకు రూ.2కే నాణ్యమైన మినరల్ వాటర్ అందించాలని కోరుతున్నారు. జీపీ అధికారులు పట్టించుకోని పక్షంలో ఈ సమస్యను మండల, జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు.



మూసిఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్

బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పారదర్శకంగా నిర్వహించాలని, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను పేర్కొనాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సీహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరగుతున్న బదిలీలు, పదోన్నతుల కోసం తప్పుడు వైద్య ధ్రువీకరణ పత్రాలు, స్పౌజ్ కేటగిరీ పత్రాలు సమర్పించిన వారిని తొలగించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియారిటీ జాబితాలో తప్పులను సవరించి పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు పల్లె శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ బాధ్యులు

కొమ్మ కత్తిరింపులతో అధిక దిగుబడి

- మామిడిలో యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాఖ అధికారి రమేశ్ సూచనలు



చెన్నారావుపేట : జిల్లాలోని పలు ప్రదేశాల్లో రైతులు మామిడి తోటలు ఏర్పాటు చేసుకున్నారు. మామిడి కోతలు కూడా పూర్తి కావస్తున్నాయి. వచ్చే సీజన్‌కు రైతులు ఎక్కువ దిగుబడి సాధించాలంటే కోతలు పూర్తి కాగానే కొమ్మ కత్తిరింపులు తప్పదు. ఇందుకోసం తీసుకోవాల్సిన జాగత్రలపై ఉద్యాన శాఖ అధికారి దయ్యాల రమేశ్ పలు సూచనలు చేశారు.

కత్తిరింపులు ఎందుకు?

సాధరణంగా కొత్త కొమ్మల మీద వచ్చే పూత పండ్ల మొక్కల్లో చాలా ముఖ్యమైనది. కొమ్మలు కత్తిరించిన తర్వాత కొత్తగా పుట్టుకొచ్చే కొమ్మలపై పూత వస్తుంది. మామిడిలో చాలా కాలంగా, చాలా రకాల్లో మార్చికి ముందు పుట్టిన కొమ్మలపై డిసెంబర్–జనవరి నెలల్లో పూత వస్తుంది. అందువల్ల మామిడి చెట్లలో కొమ్మ కత్తిరింపులతో ఫలితం ఉండదనే భావన రైతుల్లో ఉంది. జన్యు పరంగా మామిడి ఆకులు కిరణజన్య సంయోజన క్రియకు అవసరమైన శక్తిని సూర్య రశ్మి నుంచి గ్రహించడంలో జామ, సీతాఫలం వంటి మొక్కలతో పోలిస్తే చాలా తక్కువ సామర్థ్యం కలిగి ఉంటాయి. సూర్యరశ్మి బాగా తగిలితే (ఎక్కువ శాతం ఆకులు నీడలో ఉంటాయి) ఈ సామర్థ్యం మరీ తగ్గుతుంది. ఫలితంగా దిగుబడి తగ్గే అవకాశం ఉంది.

కొమ్మ కత్తిరింపుతో మామిడిలో మార్పులు

సీ–రేషియో కొమ్మలు కత్తిరించడంతో సూర్యరశ్మి చెట్టులోకి బాగా ప్రసరించి ఆకులకు సోకి, కిరణజన్య సంయోజన క్రియ బాగా జరిగి ఎక్కువగా పిండి పదార్థాలను తయారు చేసుకుంటుంది. వీటి నిల్వలు పెరగడం వలన నత్రజని నిల్వలు తగ్గుతాయి. ఈ విధంగా అధిక పిండి పదర్థాలు, తక్కువ నత్రజని (సీఎన్) ఉండటంతో పూత రావడానికి అవసరమైన పరిస్థితులు చెట్టుకు కలుగుతాయి.

శ్వాసక్రియ

కొమ్మల కత్తిరింపు వల్ల మామిడి చెట్ల ఆకుల్లో జిబ్బరిల్లిన్ మాదిరి రసాయనాలు కత్తిరించని ఆకుల్లో కంటే తక్కువగా ఉంటాయి. అందువల్ల పూత తొందరగా వస్తుంది.

కొమ్మ కత్తిరింపు విధానం

కాయలను కోయడం మే నెలాఖరు వరకు అన్ని తోటల్లో పూర్తి అవుతుంది. కాయలు కోసిన తర్వాత చెట్లకు 20–25 రోజులు విశ్రాంతి ఇవ్వాలి. ఎండిన పూత కాడల (కొరడాలు) ద్వారా ఎండు తెగులు వ్యాపించే ప్రమాదం ఉన్న క్రమంలో వాటిని తొలగించాలి. పాడి పశువులకు అడ్డం లేకుండా నేలను తగులుతున్న, అడ్డదిడ్డంగా ఉన్న కొమ్మలను తొలగించాలి. తర్వాత చెట్టుపై భాగం మధ్యలో ఉండే కొమ్మలను తొలగించాలి. తద్వారా సూర్యరశ్మి చెట్టు మొత్తాన్ని ఆకర్శిస్తుంది. కత్తిరింపు చేపట్టిన వెంటనే ఎకరానికి 60 గ్రాములు కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేయాలి. కొమ్మలు కత్తిరించడంతో కొత్తగా వచ్చిన చిరుకొమ్మలు 4–5 నెలలు ముదిరి పూతకొస్తాయి. జూన్–జూలైల్లో ప్రతి బంగినపల్లి రకం మొక్క చిన్న కొమ్మలను 10 సెంటీమీటర్ల వెనక్కు కత్తిరించాలి. (అంటే కత్తిరించేటప్పుడు ఆకుల సముదాయం (గుంపు) ఉన్న చోటికి ఒక అంగుళం పైకి కత్తిరించాలి. దీంతో ప్రతీ కత్తిరించబడిన భాగం నుంచి 3–5 కొత్త చిగుళ్లు పుడతాయి. ఈ విధంగా ఒక్కో కొమ్మకు బదులు 3–4 చిన్న కొమ్మలను అభివృద్ధి చేస్తే అవి నాలుగు నెలలు (ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) ముదిరి నవంబర్–డిసెంబర్‌లో ఎక్కువగా పూత రావడానికి అవకాశం ఉంది. ఈ విధంగా చేసిన తర్వాత (కొత్త చిగురు తొడగిన తర్వాత చెట్టంతా తడిసేలా ఎకరానికి 500 మిల్లీ లీటర్ల క్లోరిపైరిపాస్, ఎకరానికి 200 లీటర్ల నీటిలో కిలోన్నర ఫార్ములా–4 ఎకరానికి కలిపి సుమారు 10 సంవత్సరాలు దాటిన చెట్టుకు 8–10 లీటర్ల మందు ద్రావణం పడేలా పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం

పదేళ్లకు పైబడిన ఒక్కో మొక్కకు 2 కిలోల యూరియా, 5 కిలోల సూపర్, కిలో పొటాష్ కలిపి పాదుల్లో పోసి మట్టి కప్పాలి. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి.



కొమ్మలను కత్తిరిస్తున్న రైతులు

కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలి

హన్మకొండ కల్చరల్: కులమతాలకతీతంగా బ్రహ్మంగారి కాలజ్ఞానాన్ని ప్రచారం చేయాలని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మునిమనవడు నొస్సం వెంకటాద్రి స్వామి అన్నారు. భద్రకాళి రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి, అర్చకుడు గూటోజు కేదారేశ్వరాచారి శిష్యబృందం పూర్ణకుంభంతో స్వాగతించి పాదపూజ చేశారు. కార్యక్రమంలో కొక్కొండ శంకరయ్య, వేల్పుల దేవాచారి, తాటికొండ మల్లేషం, రమణాచారి, కొండోజు వీరాచారి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఓరుగల్లు విశ్వబ్రాహ్మణ గురుపీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వరంగల్ హంటర్‌రోడ్డులోని పద్మావతి గార్డెన్స్‌లో సమాజంపై కాలజ్ఞాన ప్రభావం అనే అంశంపై విశ్వకర్మ సదస్సు జరిగింది. విశ్వబ్రాహ్మణ గురుపీఠం కన్వీనర్ చొల్లేటి కృష్ణమాచారి అధ్యక్షతన జరిన సదస్సులో ముఖ్యఅతిథులుగా మఠాధిపతి వెంకటాద్రి స్వామి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి పాల్గొని ప్రసంగించారు.